సాక్షి వికారాబాద్

సోమవారం । 7 । ఆగస్టు । 2023



సండే.. సండడి

అనంతగిరి గుట్టలో ఆదివారం పర్యాటకులు సండడి చేశారు. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చారు. 8లో▸



ఎన్నాళ్లీ నిరీక్షణ..!

తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక వెలవెలబోతుంది. పనుల నిమిత్తం వచ్చే రైతులు పడిగాపులుకాస్తున్నారు. 8లో▸



సంక్షోభంలో వసతి గృహాలు

ప్రభుత్వ వసతి గృహాలు సమస్యల నిలయంగా మారాయి. మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

శాసనసభలో వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదివారం అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల కేంద్రంలో నూతన రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్నారు. ధారూరు మండల కేంద్రంలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్



మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

అనంతగిరి: తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జయశంకర్ సార్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయన ఆశయాల సాధనకు మనమంతా సమష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, బీసీ అభివృద్ధి జిల్లా అధికారి ఉపేందర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజి, రాష్ట్ర, జిల్లా స్థాయి వెనుకబడిన తరగతుల సంఘం సభ్యులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, సంక్షేమ వసతి గృహాల అధికారులు, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరిట మోసం

రూ.7 కోట్లతో ఉడాయించిన మహిళ



వసంత

షాద్‌నగర్ రూరల్: చీటీల పేరిట ఓ మహిళ ఘరానా మోసానికి పాల్పడి రూ.7 కోట్లతో ఉడాయించింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్ లింగం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పద్మావతి కాలనీకి చెందిన శ్రీనివాస్ షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో క్లర్కుగా పని చేస్తున్నాడు. ఇతడి భార్య వసంత 20 ఏళ్లుగా చీటీల వ్యాపారం చేస్తోంది. సకాలంలో డబ్బులు చెల్లిస్తూ నమ్మకం పెంచుకుంది. దాదాపు వంద మంది వద్ద రూ. 7కోట్ల వరకు వసూలు చేసింది. 15 రోజుల క్రితం ఆ డబ్బు తీసుకొని భర్త శ్రీనివాస్‌తో కలసి పారిపోయింది. ఇటీవల ఇంటిని కూడా విక్రయించి సొమ్ము చేసుకుంది. కొన్ని రోజులుగా వసంత కనిపించకపోవడం, ఆమె భర్త శ్రీనివాస్ ఆర్టీసీ విధులకు వెళ్లకపోవడంతో చీటీలు వేసిన వారికి అనుమానం వచ్చింది. తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహిళ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుకు బాలుడి మృతి

నందిగామ: పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన నందిగామలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జనార్దన్ కుమారుడు అనిరుధ్(5) సాయంత్రం తోటి పిల్లలతో కలసి ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ సమయంలో బాలుడిని పాము కాటు వేసింది. కొంత సమయం తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పనితీరే ప్రామాణికం

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. నాలుగేళ్ల సర్వీసుతో పాటు వారి పనితీరు ఆధారంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ కొనసాగనుంది. త్రిసభ్య కమిటీ సభ్యులు పంచాయతీలను పరిశీలించి వీరికి మార్కులు కేటాయిస్తున్నారు.

- పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభం
- అభివృద్ధి పనులను పరిశీలించి మార్కులు కేటాయిస్తున్న త్రిసభ్య కమిటీ
- నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 314 మంది జేపీఎస్‌లు



కామరెడ్డిగూడలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను వారి పనితీరు ఆధారంగా రెగ్యులరైజ్ చేస్తామని ఇటీవల ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలివ్వడంతో జిల్లా స్థాయి అధికారులు పంచాయతీల్లో పర్యటిస్తూ జేపీఎస్‌ల పనితీరుకు మార్కులు వేస్తున్నారు. వీరి పనితీరును మూల్యాంకనం చేసేందుకు జిల్లా స్థాయి అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో అదనపు కలెక్టర్, డీఎఫ్ఓ, డీపీఓలున్నారు. పది రోజులుగా ఈ కమిటీ సభ్యులు ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో కలిసి గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు. జీపీల్లో చేపట్టిన పనుల ఆధారంగా మార్కులను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

జీఓ 26తో జేపీఎస్‌ల సమ్మె

2019లో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా రాత పరీక్ష నిర్వహించి జేపీఎస్‌లను నియమించింది. మొదటి మూడేళ్లు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో చేర్చుకుంది. అయితే పని ఒత్తిడి కారణంగా చాలా మంది మధ్యలోనే ఉద్యోగాలు మానేశారు. దీంతో ఖాళీ అయిన స్థానాల్లో గతంలో పరీక్షకు హాజరైన వారిలో మెరిట్ ఆధారంగా కొత్తవారిని పలు దఫాలుగా తీసుకుంది. మూడేళ్ల తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం గతేడాది, మరో ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిని పొడిగిస్తూ జీఓ 26ను తీసుకొచ్చింది. దీంతో జేపీఎస్‌లు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారు. 16 రోజుల పాటు సమ్మె చేసిన జేపీఎస్‌లపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. దీంతో చాలా చోట్ల జేపీఎస్‌లు సమ్మెకు దూరమై విధుల్లో చేరారు. అనంతరం జేపీఎస్‌ల సంఘం సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే.

సగం పంచాయతీల్లో సర్వే పూర్తి

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారికి ఆశలు చిగురించాయి. పనితీరు ఆధారంగానే రెగ్యులరైజ్ ఉంటుందని చెప్పడంతో కొంత ఆందోళన చెందుతున్నారు. వీరి పనితీరుకు మార్కులు వేసేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, అడిషనల్ ఎస్పీ (డీటీసీ) మురళీధర్ తదితర అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ సభ్యులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వీరు జీపీల్లో రికార్డుల నిర్వాహణ, పన్ను వసూళ్లు, మొక్కల సంరక్షణ, రోడ్డు, మురుగు కాల్వల పరిశుభ్రత, కంపోస్టు ఎరువుల తయారీ, డంపింగ్ యార్డు నిర్వాహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పంచాయతీ ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపు తదితర అంశాలను పరిశీలిస్తూ మార్కులను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటికే సగం జీపీల్లో ఈ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో 566 జీపీలు ఉండగా 561 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఇందులో 418 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కాగా 314 మంది నాలుగు ఏళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్నారు. వీరందరి భవిష్యత్తు త్రిసభ్య కమిటీ అధికారులు ఇచ్చే మార్కులపై ఆధాపడి ఉంది.

మార్కుల కేటాయింపు ఇలా

- మార్కుల కేటాయింపులో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ప్రభుత్వం అధిక ప్రాధ్యనత ఇచ్చింది. మురుగు కాల్వలు, రోడ్ల శుభ్రత, దోమల నివారణకు చర్యలు, డంపింగ్ యార్డు నిర్వాహణ, వైకుంఠధామం, కంపోస్టు ఎరువు తయారీ, మొక్కల పెంపకం, పంచాయతీ రికార్డుల నిర్వహణ, క్రీడా ప్రాంగణాల నిర్వాహణ పక్కాగా చేపడితే 35 మార్కులను కేటాయిస్తారు.
- గ్రామంలోని రోడ్లకు ఇరుపక్కల, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో మొక్కలు నాటడం, తోటల పెంపకానికి 10 మార్కులు.
- విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు సక్రమంగా చెల్లిస్తే 10 మార్కులు.
- వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు చేస్తే 10 మార్కులు .
- జీపీల్లో నర్సరీ, మొక్కల పెంపకం, పంపిణీకి 10 మార్కులు.
- జనన, మరణాల రికార్డుల నిర్వాహణకు 5 మార్కులు.
- తడి, పొడిచెత్త సేకరణకు 15 మార్కులు.
- జీపీ నిధుల నుంచి 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తే 5 మార్కులతో పాటు మొత్తం 100 మార్కులు ఇవ్వనున్నారు.

పనులు పరిశీలిస్తున్నాం



లోకల్ బాడీ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో జేపీఎస్ లు చేపట్టిన పనులను పరిశీలిస్తున్నాం. పంచాయతీ ల నిర్వహణను బట్టి ప్రభుత్వం నిర్దేశించిన మార్కులను కేటాయిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి క్షేత్ర స్థాయిలో మార్కుల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేస్తాం.

– తరుణ్ కుమార్, డీపీఓ, వికారాబాద్



భూ వివాదం కారణంగా కర్రలతో దాడి చేసుకుంటున్న గుండాల రైతులు

భగ్గుమన్న భూ తగాదాలు!

- గుండాలలో ఇరువర్గాల ఘర్షణ
- కర్రలతో దాడిచేసుకున్న వైనం
- ఐదుగురికి తీవ్ర గాయాలు

దోమ: గ్రామాల్లో భూతగాదాలు అంతకంతకూ పెరగిపోతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని గుండాలలో బీసీ, రెడ్డి కులస్తుల మధ్య మూడెకరాల పెచిలుకున్న భూమి విషయంలో తగదా జరగడంతో ఇరు వర్గాలు కర్రలతో విచక్షణారహితంగా దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, పలువురికి స్వల్పగాయాలయ్యాయి.

సర్వే ఆధారంగా సాగు

గ్రామంలోని సర్వేనంబర్ 204లో 8.16ఎకరాల అసైండ్ భూమి ఉంది. గత ప్రభుత్వాలు అదే గ్రామానికి చెందిన కొంత మంది రైతులకు అసైండ్ భూమిలో పట్టాలిచ్చింది. కుక్కల నర్సింహులు వారి దాయాదుల పేరుపై ఐదెకరాలకు పై చిలుకు భూమికి అసైండ్ పట్టా ఉంది. అదే సర్వే నంబర్‌ను ఆనుకుని 203లో రాచపాల్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అయిల్‌రెడ్డిలకు చెందిన 10 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. వీరు సర్వేనంబర్ 204లో కొంతభాగం కబ్జాలో ఉన్నారు. ఈ భూమిలో కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. వానాకాలంలో వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేశారు. ఆ భూమి తమకే చెందుతుందని గ్రామానికి చెందిన కుక్కల నర్సింహులు, నర్సయ్య, రామయ్య, అంజిలయ్య, చిన్న అంజిలయ్య ఇటీవలే ప్రభుత్వ సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. పంచనామా నిర్వహించిన రెవెన్యూ అధికారులు రెండెకరాల పైచిలుకు భూమి కుక్కల నర్సింహులు కుటుంబీకులకే వర్తిస్తుందని రిపోర్టు ఇచ్చారు. రిపోర్టు ఆధారంగా వారు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. శనివారం రాత్రి ఆ నారుమడులను రాచపాల్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అయిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి ధ్వంసం చేశారు. ఆదివారం నాటు వేసేందుకు వెళ్లిన నర్సింలు కుటుంబీకులు గమనించి వారితో గొడవపడ్డారు. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు కర్రలతో దాడులకు దిగారు. ఈ దాడిలో అయిల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, వెంకటయ్య, నాగేశ్ తీవ్రంగా గాయపడగా మరికొందుకు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు 31 మందిపై కేసు నమోదు చేశారు.

రాజకీయ కక్షలే కారణమా..?

పలువురు రాజకీయ నేతల ఒత్తిడితోనే గుండాలలో తగాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల కారణంగా గ్రామస్తులు కర్రలతో దాడులు చేసుకునేంత వరకు వెళ్తున్నాయంటున్నారు. సర్ది చెప్పాల్సిన నేతలే తగాదాలను పెంచి పోచిస్తున్నారని గ్రామస్తులతో పాటుగా మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.





దాడిలో గాయపడిన మోహన్‌రెడ్డి , నాగేశ్, అయిల్‌రెడ్డి

దమ్ముంటే జాతీయ హోదా తెండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలు
- రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్ రూరల్: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజావరప్రసాద్ సవాల్ విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజావరప్రసాద్ మాట్లాడారు. సంక్రాంతి పండుగకు వచ్చే గంగిరెద్దులు, హరిదాసుల్లా బీజేపీ నేతలు గ్రామాల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు సైనికుల శవాలపై ఓట్లు అడుక్కుంటారని ఆరోపించారు. ఆలయాల పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. ఉదండపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి కాగానే లక్ష్మీదేవిపల్లిని ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 50ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకురాలు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, శంకర్, రవియాదవ్, నర్సింహ, అశోక్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించండి

రైల్వే డీఆర్ఎంకు ఆర్యవైశ్య సంఘం వినతి

తాండూరు టౌన్: తాండూరు ప్రాంతం మీదుగా గతంలో రద్దు చేసిన రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం నాయకులు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ డీఆర్ఎంకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నాపరాయి, సిమెంట్, కంది తదితర వ్యాపారాలకు ప్రసిద్ధి గాంచిన తాండూరు ప్రాంతం నుంచి వ్యాపారులు రైళ్లలో పలు ప్రాంతాలకు వెళ్తూ ఉంటారన్నారు. కరోనా సమయంలో రద్దయిన గుల్బర్గా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, తాండూరు–గుల్బర్గా ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని విన్నవించారు. తాండూరు మీదుగా వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను తాండూరు స్టేషన్‌లో నిలపాలని కోరారు. తిరుమల శ్రీవారి దర్శనానికి ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున వెళ్తుంటారని తిరుపతికి తాండూరు నుంచి ప్రత్యేక రైలును వేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరేందర్, కార్యదర్శి కోట మురళీకృష్ణ, రవీందర్, అశోక్, సత్యనారాయణ తదితరులున్నారు.



రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

బీఆర్ఎస్‌లో ఇంటి పోరు

- శాసనసభ్యుడిగా పోటీ చేసేందుకు ఆశావహుల ఆరాటం
- నాలుగు నియోజకవర్గాల్లోనూ పెరుగుతున్న జాబితా
- ప్రస్తుత ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఉందంటూ పార్టీ నేతలే ప్రచారం
- టికెట్ దక్కకుంటే మరో పార్టీ నుంచి పోటీకి సై



వికారాబాద్: అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇంటి పోరు మొదలయ్యి ఏళ్లు గడుస్తుండగా.. ఇప్పుడు తీవ్రమవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమరం మరో నాలుగు నెలలుండగానే రాజకీయ వేడి మొదలయింది. జిల్లాకు చెందిన నాలుగు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇందులో కొందరు నేతలు అధిష్టానాన్ని ఒప్పించి తామే పోటీ చేస్తామంటూ ప్రచారం చేసుకుంటుంగా.. మరికొందరు పార్టీ ఏదయినా సరే ఎమ్మెల్యే బరిలో ఉంటామంటున్నారు. రిజర్వేషన్ ఉన్న నియోజకవర్గాల నేతలు పక్క నియోజకవర్గాల మీద దృష్టి సారిస్తుండగా.. ఇంకొందరు సొంత నియోజకవర్గాల్లోనే అమీతుమీ తేల్చుకుంటామని బాహాటంగానే పేర్కొంటున్నారు. మూడేళ్ల పాటు మిన్నకుండిన నేతలు ఏడదిన్నరగా ప్రస్తుత ఎమ్మెల్యేలకు దూరంగా ఉంటూ వారిపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా నేతలు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉంది.. వారికి టికెట్లు ఇస్తే పార్టీకి నష్టం జరుగుతుంది. ప్రత్యామ్నాయంగా తమ పేర్లను పరిశీలించాలంటూ అధికార పార్టీ ఆశావహులు అధిష్టానంతో పాటు తమకు తెలిసిన మంత్రులు, ముఖ్య నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

పట్నం, పైలట్ మధ్య టైట్ ఫైట్

తాండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నది మొదలు రాజకీయాలు వేడెక్కాయి. పార్టీ నుంచైనా.. ప్రభుత్వ కార్యక్రమైనా.. ప్రైవేటు కార్యక్రమాలైనా పట్నం, పైలట్ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పార్టీ సభ్యత్వ కర్యక్రమాలు, కమిటీలు, ప్రత్యేక సమావేశాలు ఇలా ఏ కార్యక్రమైనా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. ఇటీవల పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ మారుతారంటూ ప్రచారం జరుగుతుండగా ఆయన దాన్ని కొట్టిపారేస్తున్నారు. తాజాగా తాండూరు టికెట్‌ను బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆశిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదరణ పెంచుకుంటున్నాడు. ఒక్క బీసీ నేతకు పార్టీ టికెట్ ఇవ్వకపోతుండా అనే ధోరణిలో ఆయన కూడా పోటీకి సై అంటున్నారు.

రిజర్వ్‌డ్‌లోనూ రివర్స్

ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన జిల్లా కేంద్రం వికారాబాద్‌లోనూ ఇంటిపోరు కనిపిస్తోంది.. ఇటీవల ఇక్కడ ఆశావహుల జాబితా చాతాడంత పెరిగింది. ఇటీవల జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్ పార్టీ పెద్దలను కలిసి ప్రయత్నాలు చేస్తున్నారంటూ వినిపిస్తోంది. మరో నాయకుడు అధికార పార్టీ కార్మిక విభాగం నేత బి.కృష్ణ ప్రస్తుత ఎమ్మెల్యే విమర్శలు పాలవుతున్నారని ప్రత్యామ్నాయంగా తన పేరు పరిశీలించాలని అధిష్టాన్ని కోరుతున్నారు. మరో నేత వడ్ల నందు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పేర్లతో వాల్‌రైటింగ్స్‌తో చర్చకు తెర తీస్తున్నాడు. సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లోకి వెళ్తున్నాడు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు ప్రత్యామ్నాయంగా ఈ సారి టికెట్ తనకే ఇవ్వాలని మరో డాక్టర్ టి.ఆనంద్ ప్రయత్నాలు ప్రారంభించారు.

పరిగి, కొడంగల్‌లో లుకలుకలు

జనరల్ నియోజక వర్గాలైన పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ తరఫున పలువురు నేతలు ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్నామంటూ చర్చకు తెరతీస్తున్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఇటీవల వరకు టికెట్ కోసం యత్నించి తాజాగా కాంగ్రెస్ గూటికి చేరడంతో బీఆర్ఎస్‌కు బలం తగ్గినట్టయింది. ప్రస్తుత ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి నియోజకవర్గ కేంద్రంలో బలం పుంజుకోలేకపోతున్నారు. పరిగి నియోజకవర్గం నుంచి పలువురు టీఆర్ఎస్ సీనియర్ నేతలు ఎమ్మెల్యే టికెట్ రేసులో తాము సైతం అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో నాగేందర్ కొద్ది రోజులు హడావిడి చేసినా ఇప్పుడు మిన్నకుండి పోయారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవిలో కొనసాగుతున్న నియోజకవర్గ నేత బుయ్యని మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీలో ఉండేందుకు పావులు కదుపుతున్నారు. తాను పోటీలో ఉండటం ఖాయం అంటూ ప్రచారం చేసుకుంటున్నాడు. తన కంటూ ఓ గ్రూపును తయారు చేసుకోవడంలో ఆయన సక్సెస్ అయ్యారు.

మాటతీరుతోనే గౌరవం పెరుగుతుంది

అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి



శివధర్‌రెడ్డిని సన్మానిస్తున్న జీఎస్ఎఫ్ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: సమాజంలో గౌరవం పెరగాలంటే మన మాట తీరుపైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్ర అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. జ్ఞాన సరస్వతి ఫౌండేషన్, ఎస్పీ స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న వక్త మూడో బ్యాచ్ శిక్షణ శిబిరాన్ని వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం మాట్లాడే విధానంతోనే మన గౌరవం పెరుగుతుందని అన్నారు. అందుకే మాట్లాడే విధానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి రంగంలో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. అందుకు అనుభవజ్ఞులు, నిపుణల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు రాణి రుద్రమదేవి మాట్లాడుతూ.. వ్యక్తిగా ఎదగాలంటే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పెద్దల అనుభవాల నుంచి ఎన్నో అంశాలను నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరుచుకుంటేనే ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి లక్ష్మణాచార్యులు, ఆర్టీఏ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, జీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు సదా వెంకట్‌రెడ్డి, ఎస్పీ స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ వ్యవస్థాపకులు సంజయ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధునికీకరణ పనుల్లో సరికొత్త కళ

తాండూరు రైల్వే స్టేషన్‌లో శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న

తాండూరు: రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా ఆదివారం అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న నిర్వహించారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యక్ష ప్రసారంలో జాతినుద్దేశించి ప్రసంగించారు. అనంతరం తాటికొండ స్వప్న మాట్లాడుతూ తాండూరు రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులతో స్టేషన్‌కు కొత్త కళ వస్తోందన్నారు. కొన్నేళ్లుగా ప్రయాణికులు మౌలిక సదుపాయాలు కల్పించాలని రైల్వే శాఖ అధికారులకు వినతులు అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మురళికృష్ణగౌడ్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు సదానందరెడ్డి, యు. రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ ట్యాంకర్, బైక్ ఢీ

హోంగార్డు మృతి



ప్రమాదస్థలిలో గౌస్‌పాష మృతదేహం



గౌస్ పాష (ఫైల్)

పరిగి: లారీ, బైక్ ఢీకొనడంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. దోమ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్‌పాష(38) నగరంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన పరిగి నుంచి రాఘవపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా షాద్‌నగర్ నుంచి పరిగి మార్గంలో ఎదురుగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ (లారీ) ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

ప్రయాణికుడి మృతి



బస్వరాజ్ పాటిల్ మృతదేహం

తాండూరు టౌన్: కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. కరన్‌కోట పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఓగిపూర్ గ్రామానికి చెకందిన పటోళ్ల బస్వరాజ్ పాటిల్(56) ఆదివారం ఆటోలో తమ గ్రామానికి వెళ్తున్నాడు. ఆటోకు కుక్క ఎదురు రావడంతో డ్రైవర్ నరేశ్ దాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పిన ఆటో బోల్తాపడింది. దీంతో బస్వరాజ్ పాటిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు మున్నెప్ప పాటిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొత్త గా ప్రవేశపెట్టిన ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 17 వరకు, రూ.500 అపరాధ రుసముతో 19 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పీజీ టీఎస్‌పీజీఈసెట్–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ, తెలంగాణ వర్సిటీ 20 23–24 విద్యా సంవత్సరానికి ప్రవేశపెట్టిన కోర్సులో ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

సండే.. సందడి

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పలువురు స్నేహితులతో కలిసి ఇక్కడికి వచ్చారు. చిన్నా,పెద్ద అడవిలో విహరించారు. చెట్ల మధ్య, చల్లటి గాలిలో కలియతిరిగారు. అక్కడ నీటి ప్రవాహం వద్ద ఆడుతూ, పాడుతూ సరదాగా సాయంత్రం వరకు గడిపారు. వాచ్ టవర్‌పై ఎక్కి అనంతగిరి అందాలను తిలకించారు.

ధారూరు: హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చిన పర్యాటకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లనీయకుండా ఫారెస్టు సిబ్బంది ప్రతిఘటించడంతో వారు వాగులు, వంకల వద్ద సేదతీరాల్సి వచ్చింది. ముఖ్యంగా ప్రాజెక్టు అలుగునీరు ప్రవహిస్తున్న వాగులో కిలోమీటర్ల మేర నడిచారు. గంటల తరబడి ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఎగుడు, దిగుడు, లోతైన నీటిలో, బండరాళ్ల మధ్య నడిచారు. ప్రాజెక్టు పరిసరాలతో పర్యాటకులు పచ్చదనాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. అడవి అందాలను చూస్తు అక్కడే తిరుగుతూ వనభోజనాలు చేసి సాయంత్రం వరకు ఉన్నారు.



సేద తీరుతున్న పర్యాటకులు



అడవి దారినుంచి వస్తున్న పర్యాటకులు



యువతుల కేరింత



ధారూరు: అలుగు నీటి ప్రవాహం వద్ద పర్యాటకుల కోలాహలం



వాచ్ టవర్ వద్ద సందడి

ఘనంగా వడ్లనందు జన్మదిన వేడుకలు



వడ్లనందుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

అనంతగిరి: బీఆర్ఎస్ జిల్లా నాయకులు, వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ వడ్లనందు జన్మదినాన్ని బీఆర్ఎస్ నా యకులు, కార్యకర్తల మధ్య ఆదివారం కేక్ కట్ చేసి ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రా ష్ట్ర నాయకులు నాగేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ రా ంచంద్రారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ సీనియర్ నాయకులు అంజయ్య, పరమేశ్, రాజేందర్‌రెడ్డి, ముజఫర్ ష రీఫ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న సదానంద రెడ్డి

అనంతగిరి: అనంతగిరి అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన అనంతగిరిలో పర్యటించి పర్యాటకులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఊటీగా పిలవబడే ఈ ప్రాంతంలో మౌలిక వసతులు, కరువయ్యాయన్నారు. కేంద్ర మంత్రివర్యులు కిషన్‌రెడ్డి పర్యాటక శాఖ నుంచి కూడా నిధులను మంజూరు చేయించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కానీ ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఈ పర్యాటక ప్రాంతం ఉందన్నారు. అనంత పద్మనాభస్వామి, బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనం అనంతరం అనంతగిరి కొండల్లో ట్రాకింగ్ చేస్తూ కోటపల్లి ప్రాజెక్టు, సర్పన్ పల్లి ప్రాజెక్టు, దామగుండం సందర్శనకు వెళ్లిన ప్రయాణికులు మౌలిక సదుపాయాల్లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రసాద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు

మాజీ మంత్రి ప్రసాద్ కుమార్

అనంతగిరి: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వికారాబాద్ మండలంలోని సిద్దులూర్ గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొమ్మిది ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనని ఆయన గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవబోతుందని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ లింగారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ అనంతయ్య, బీజేపీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పరమేశ్ పలువురు నాయకులతో పాటు సుమారు 200 మంది చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్ రెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కిషన్ నాయక్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ జాఫర్, ఎల్డీఎం ఇన్‌ఛార్జి రఘుపతి రెడ్డి, జంగయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన యాగం



యాగంలో పాల్గొన్న దంపతులు

కొడంగల్: పట్టణంలోని శ్రీ కేశవ స్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం సుదర్శన యాగం ఘనంగా నిర్వహించారు. అర్చకులు యాగ కృతువుని పూర్తి చేశారు. 33 హోమ గుండాలతో 33 మంది దంపతులు సుదర్శన యాగంలో పాల్గొన్నారు. ఈ యాగం వల్ల లోక కల్యాణం సిద్ధిస్తుందని అర్చకులు తెలిపారు. అధిక శ్రావణ మాసం విష్ణుమూర్తికి ప్రీతికరమని పేర్కొన్నారు. పురందరదాసుల సంకీర్తనలు 33 పాటలతో నాద సంకీర్తన ఆలపించారు. దుష్ట శిక్షణ శిష్ట రక్షణకు విష్ణుమూర్తి సుదర్శన చక్రంతో దేశాన్ని రక్షించారని తెలిపారు. ఆరోగ్యం ధన, ధాన్యాలు రాజ్యాధికారం సిద్ధిస్తాయని అర్చకులు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. యాగంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మెదక్ డీసీసీబీ బ్యాంకు జనరల్ మేనేజర్ పురుషోత్తంరావ్ దేశ్‌పాండే, వికారాబాద్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్రా యాదవ్, దీపధూప నైవేద్యం అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ఠ, శ్రీ కేశవ స్వామి ఆలయ అర్చకుడు అక్కి శ్రీనివాసా మూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ వెంకటేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంఘాయిపల్లి గేట్ వద్ద ఆదివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ !

- సిబ్బంది లేక వెలవెలబోతున్న మండల కార్యాలయం
- ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్న వైనం
- విధుల్లో చేరని నూతన తహసీల్దార్

దోమ: అధికారులు లేక తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోతుంది. ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే రైతులకు అధికారులు లేక నిరీక్షణ తప్పడం లేదు. ఇక్కడ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్నాయి. రిజిస్ట్రేషన్లు, ఇతర పనుల నిమిత్తం వచ్చే రైతులకు కార్యాలయంలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.

ఖాళీ కుర్చీలే..

దోమ మండల కార్యాలయంలో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆర్ఐలు, టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, వీఆర్ఏలు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇందులో కేవలం టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. తాజాగా ఇటీవలే ఉన్నత స్థాయి అధికారులు తహసీల్దార్ల బదిలీ ప్రక్రియను చేపట్టారు. దోమ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న షాహెదబేగంను గద్వాల జిల్లాకు బదిలీ చేశారు. పరిగిలో విధులు నిర్వహిస్తున్న రాంబాబును దోమ తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు నియమించారు. దోమలో ఇప్పటికీ తహసీల్దార్‌గా రాంబాబు విధుల్లో చేరలేదు. ఇక్కడ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విజయేందర్ హైదరాబాద్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిశీలన నిమిత్తం వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఏళ్ల తరబడి ఖాళీగా ఉంది. దీన్ని పట్టించుకునే వారు లేరు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌ను నగరంలో ఈవీఎం అవగాహన నిమిత్తం పంపించారు. ఇద్దరు ఆర్ఐలలో ఒకరిని కోట్‌పల్లి మండలానికి బదిలీ చేశారు. మరో ఆర్ఐ గత కొన్ని రోజులుగా దీర్ఘకాలం సెలవులో ఉన్నారు. ఇక్కడి కార్యాలయంలో టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.



దోమలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కూర్చున్న రైతులు

అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణమా?

అధికార పార్టీకి చెందిన నేతల ఒత్తిడికి ఈ మండలానికి ఏ అధికారి రావాలన్నా జంకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి అనుకూలమైన పనులను చేయకపోవడంతో అధికారులను బదిలీలు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఓ తహసీల్దార్‌ను వారి పనులను చేయలేదనే ఉద్దేశంతో బొంరాస్‌పేట మండలానికి బదిలీ చేయించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్‌ను దోమకి బదిలీ చేయించుకున్నారు. ఇప్పుడు ఇటీవలే తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. దీంతో మండలానికి నూతనంగా పరిగిలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రాంబాబును అధికారులు దోమకు నియమించారు. కానీ అతను విధుల్లో చేరకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధికి గిట్టకనే దోమకు రావడంలో ససేమిరా అంటున్నారనే వినికిడి ప్రచారమవుతుంది. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న ఓ ఆర్ఐని సైతం ఇక్కడి నుంచి కావలనే బదిలీ చేయించారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇక్కడికి ఏ అధికారి రావాలన్నా జంకుతున్నారు. మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి రైతులు తహసీల్దార్ కార్యాలయంలోనే నిరీక్షిస్తున్నారు. రైతులు ఆయా గ్రామాల నుంచి కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి ఉదయం నుంచి సాయంత్ర వరకు వేచి ఉండి తిరిగి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.



తహసీల్దార్ లేక వెలవెలబోతున్న కుర్చీ

గుట్కా తయారీ కేంద్రంపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కాలు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ గుట్కాలను తయారు చేస్తున్న కేంద్రంపై ఆదివారం మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా గంగానగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్(49) మరో యువకుడితో కలిసి షాహీన్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వెనకాల కొన్ని రోజులుగా నకిలీ గుట్కాలను తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్ఓటీ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 లక్షల విలువైన సాగర్ పాన్ మసాల, అంబర్ పొగాకు, జర్దా ముడి సరుకు, తయారీ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.

ముదిరాజ్‌లను బీసీ - ఏ గ్రూప్‌లో కలపాలి

ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ కులస్తులను బీసీ ఏ గ్రూప్‌లో కలపాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కావాలి వెంకటేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి అన్నారు. ముదిరాజ్ ఉద్యోగ సంఘ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం యార కృష్ణ అధ్యక్షతన ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ముదిరాజ్ కులస్తులు వెనుకబడి ఉన్నందున బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, పది లక్షల ముదిరాజ్ బంధును అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్తయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు బాస్కర్, అశోక్, వెంకటేశ్,మురళి, లింగం, శ్రీను, కృష్ణ, సత్యనారాయణ, రమేష్, బాలరాజులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ

- టీఆర్టీ ఉపాధ్యాయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న కోటాజీ

కుల్కచర్ల: విద్యార్థులు ఉన్నతశిఖరాలు అధిరోహించాలని, వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల పరిధిలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో టీఆర్టీ ఉపాధ్యాయ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోటాజీ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో ఎక్కువగా చేరే విద్యార్థులందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారని చెప్పారు. వారి విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

నూతన కమిటీ..

అధ్యక్షుడిగా మహేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శరణప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, కోశాధికారిగా అరవింద్, ఉపాధ్యక్షురాలిగా మంజుల, గౌరవ అధ్యక్షుడిగా రమేశ్, కార్యదర్శులు హరిప్రసాద్, బుచ్చమ్మ, బాలమణి, సలహాదారులు గోపాల్, రేణుకాదేవి, శ్రావణి, సురేశ్, అమూల్య, సంతోష, చందర్, నమ్రత, నవనీత, మంగమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బండవెల్కిచర్ల ప్రత్యేకాధికారి బాలవరలక్ష్మి, ముజాహిద్‌పూర్ ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి నర్సింగ్ రావు, కుల్కచర్ల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి సుందర్, విక్రంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా కస్తూర్బాగాంధీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠశాల శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంగా నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా బురద, గుంతలమయంగా ఉండటంతో అటువైపు ఎవరు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాఠశాలకు ప్రహరీ పూర్తిగా లేకపోవడంతో రాత్రి సమయంలో భయం గుప్పిట్లో గడుపుతున్నారు. పాఠశాలలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటిని ట్యాంకర్ల ద్వారా పోయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల గదులకు కనీసం కిటికీలు కూడా సక్రమంగా లేవు. దీంతో విద్యార్థినులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. కాగా, పాఠశాల ఆవరణలో పెద్ద గుంత ఉండటంతో దానిలో నీరు నిండి దోమలు ప్రబలుతున్నారు. పాఠశాల పక్కనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రతి రోజు రాత్రి సమయంలో రేడియేషన్ సమస్య కూడా ఉంది. పాఠశాలలో మొత్తం 380మంది విద్యార్థినులు ఉండగా 15మంది ఉపాధ్యాయులు విధులను నిర్వర్తిస్తున్నారు.

పోలీసులు గస్తీ నిర్వహించాలి

పాఠశాల పట్టణానికి దూరంగా ఉండటంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. దీనికి తోడు పాఠశాల పరిసరాలల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. పాఠశాల పరిసరాలల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితులను అరెస్టు చేయడం దారుణం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో 'మా భూమి మాకు కావాలి' అని నిరసన దీక్షలు చేస్తున్న దళిత కుటుంబాలను మీర్‌పేట పోలీసులు అర్ధరాత్రి ఇళ్లలోకి దూరి అరెస్ట్ చేసి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బడంగ్‌పేట మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. ఎవరూ అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. స్టేషన్ హౌస్ అధికారితో పాటు వనస్థలిపురం ఏసీపీతో మాట్లాడారు. త్వరగా అరెస్టైన దళిత కుటుంబాలను వదిలిపెట్టాలని కోరారు. కబ్జాదారులను వదిలిపెట్టి బాధితులను అరెస్ట్ చేసి వేధింపులకు గురిచేయడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రొటోకాల్ మెంబర్ బంగారు బాబు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, తదితరులున్నారు.